క్లుప్తంగా

కాలేజీ హాస్టల్లో సిబ్బందిని నియమించాలి



దర్శి: ఎస్సీ–2 హాస్టల్లో జూనియర్ కాలేజీ హాస్టల్ సిబ్బందిని నియమించాలని డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవిశంకర్‌కు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 45 మంది పేద దళితులు హాస్టల్లో చదువుకుంటున్నార న్నారు. అక్కడ నైట్‌వాచ్‌మెన్ లేక పేద విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారన్నారు. తక్షణమే స్పందించి కాలేజీ హాస్టల్‌కు వాచ్‌మెన్‌తో పాటు ఇతర సిబ్బందిని నియమించాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం కంటి వైద్య నిపుణులు శ్రీనివాసగౌడ్ కంటి పరీక్షలు చేశారు. అందులో 45 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి వెంటనే ఆన్‌లైన్ చేశారు. విద్యార్థులు కళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అన్ని అవయవాల కన్నా కళ్లు చాలా అవసరమని కంటి వైద్యాధికారి సూచించారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, మమత, ఏఎన్ఎంలు లీలాబాయి, ఇందిర, రూతు పాల్గొన్నారు.

కురిచేడు: స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆదేశాలతో 476 మంది విద్యార్థులకు సోమవారం నేత్ర పరీక్షలు చేశారు. మండలంలోని వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 276 మంది విద్యార్థులకు, బోధనంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. వారిలో 50 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి జిల్లా అంధత్వ నివారణ సంఘం కంటి అద్దాలు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఆప్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, గురుస్వామి పాల్గొని విద్యార్థులకు నేత్రపరీక్షలు నిర్వహించారు.

పత్తిలో యాజమాన్యం పాటించండి

ఏడీఏ బాలాజీ నాయక్



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

కురిచేడు: పత్తి పంటలో రసంపీల్చు పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు ఉధృతి అధికంగా ఉందని, యాజమాన్యం పాటించాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని దేకనకొండ రైతు సేవా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శన మండల వ్యవసాయాధికారి పి.మధుబాబుతో కలిసి సోమవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసంపీల్చు పురుగులు నివారణకు పంట 30–40 రోజులప్పుడు కాండంపై పూత మోనోక్రోటోఫాస్ మరియు నీరు 1:4 నిష్పత్తిలో అలాగే 60 రోజులప్పుడు ఇమిడాక్లోప్రిడ్ మరియు నీరు 1:20 నిష్పత్తిలో మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూస్తే రసం పీల్చు పురుగులు అదుపులో ఉంచుకోవచ్చన్నారు. పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 20 చొప్పున పొలంలో అమర్చడం వలన తెల్లదోమను నివారించవచ్చన్నారు. నీలి రంగు అట్టలు ఎకరానికి 20 చొప్పున పొలంలో అమర్చడం వలన తామర పురుగులు నివారించవచ్చన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ముండ్లమూరు: మందుబాబులు ప్రభుత్వ ప్రదేశాలు, రహదారుల వెంబడి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ కనిపిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని ప్రధాన రహదారి వెంబడి మద్యం సేవిస్తున్న పలువురికి సోమవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. వారితో మాట్లాడుతూ మద్యం అలవాటు ఉన్న వారు బహిరంగ ప్రదేశాలలో ఇష్టానుసారంగా మద్యం సేవించడం మానుకోవాలన్నారు. పేకాట, కోడి పందాల నిర్వహణకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

ఈ–పంటపై అవగాహన

పెద్దదోర్నాల: పంటలు వేసిన ప్రతి రైతు పొలాలను ఈ–పంట నమోదు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ పంట, సీసీఆర్సీ కార్డులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డులను కేటాయించి టార్గెట్స్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఏఎస్ఓ ప్రియాంక దీప్తి, వీఆర్వోలు, ఈఆర్ఏలు పాల్గొన్నారు.



చిన్నకొలుకుల ఏకోపాధ్యాయ పాఠశాల



బి.చెర్లోపల్లిలో మధ్యాహ్న భోజన పరిస్థితి ఇదీ..



దర్శి మండలంలోని ఓ పాఠశాలలో సాంబారులా ఉన్న టమోటా కూర

- రుచి లేని వంటలు తినలేకపోతున్న విద్యార్థులు
- ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న పిల్లలు
- మెనూ ప్రకారం అందని భోజనం

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

దర్శి: విద్యార్థులు తినే ఆహారం రుచికరంగా వండించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం బట్టబయలైంది. దర్శి మండలంలో మధ్యాహ్న భోజనం పెట్టే పాఠశాలలు 83 ఉన్నాయి. 2023–24 సంవత్సరంలో 8,833 మంది విద్యార్థులు ఉండగా 2024–2025 విద్యా సంవత్సరంలో 8,339 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్క దర్శి మండలంలోనే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 494 మంది ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించారు. అంటే ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఎంత నమ్మకం ఉందో ఇట్టే తెలిసిపోతోంది. రోజూ ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం 8,339 మంది విద్యార్థులకు దర్శి మండలంలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండి పెట్టాల్సి ఉంది. అంత మంది విద్యార్థులు ప్రభుత్వం పెడుతున్న భోజనం తినడం లేదు. పాఠశాలల్లో వండుతున్న పదార్థాలు బాగా లేవని విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తీసుకొచ్చి తింటున్నారు. వెజిటబుల్ రైస్‌లో ఒక్క టామాటాలు మాత్రమే వేసి వండారు. ఆ అన్నం కూడా తెల్ల అన్నం మాదిరిగానే ఉంది. వారికి మెనూ ప్రకారం పెట్టాల్సిన టమాటా కూర సాంబార్‌లా ఉంది. పిల్లలు మాత్రం ఏం పెట్టినా చేసేందేం లేక అలాగే తింటున్నారు.

రాజకీయ తొలగింపులు

టీడీపీ అధికారంలోకి రాగానే వంట కుక్‌లపై అధికార పార్టీ నాయకులు తమ ప్రతాపం చూపారు. తమ పార్టీకి చెందిన వారినే వంట మనుషులు కూడా ఉంచాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇప్పటికే గణేశ్వరపురం ఎస్సీ, తిమ్మాయిపాలెం ఎస్టీ, ఎర్రోబనపల్లి యూపీ, చెర్వుకొమ్ముపాలెం ఎస్సీ, కట్టశింగన్నపాలెం, తూర్పు చౌటపాలెంలో రెండు పాఠశాలలు, అబ్బాయిపాలెం, బండివెలిగండ్ల, పోతవరం, తూర్పువీరాయపాలెం ఎస్సీ, చందలూరు ఎస్సీ, లింగన్నపాలేలకు చెందిన 14 పాఠశాలల్లో వంట వారిని మార్చేశారు. మిగిలిన పాఠశాలల్లో కూడా వంట వారిని మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. వంట వారిని మార్చిన ప్రాంతాల్లో గతంలోలా భోజనం ఉండటం లేదని విద్యార్థులు చెప్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ–2 రమాదేవిని వివరణ కోరగా మెనూ ప్రకారం విద్యార్థులకు వండిపెట్టక పోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని చెప్పారు. అలాంటి వారిని తొలగించి కొత్తవారిని పెడతామని హెచ్చరించారు. విద్యార్థులు తినే అన్నం రుచికరంగా ఉండాలని సూచించారు.

దొనకొండ: సోమవారం దొనకొండ జెడ్పీ పాఠశాలను ‘సాక్షి’ విజిట్ చేసింది. విద్యార్థులు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1055 మంది ఉన్నారు. టీచర్లు 17 మంది ఉండగా టీచర్స్ అడ్జస్ట్‌మెంట్‌తో మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు ఎయిడెడ్ పాఠశాల నుంచి ఇద్దరు, ఉర్దూ పాఠశాల నుంచి ఒకరిని డిప్యుటేషన్ వేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చేశారు. బయటి నుంచి విద్యార్థులు ఎవరూ భోజనం తెచ్చుకునే వారు లేరు. నీటి బాటిల్ కూడా కనిపించలేదు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులును సమస్యలు అడగగా ప్రస్తుతానికి ఏ సమస్యలు లేవు. నాడు నేడుతో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఉన్నాయని తెలిపారు.



దర్శి: ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

తగ్గిన విద్యార్థుల సంఖ్య

ముండ్లమూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ప్రవేశాలు గతేడాదితో పోలిస్తే తగ్గాయి. గతేడాది 587 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈ ఏడాది మాత్రం 542 మంది మాత్రమే చేరారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది ట్యాబ్‌లు ఇవ్వక పోవడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలోని అయోధ్యనగర్ ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులు లేరనే సాకుతో ఈ ఏడాది ఇంకా ప్రారంభించలేదు. పాఠశాలల్లో గత ప్రభుత్వం అమలు చేసిన జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో అందించే చిక్కీలు, అరటి పండ్లు, కోడి గుడ్లు విద్యార్థులకు అందిస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరత

కురిచేడు: మండలంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీనికి తోడు జూనియర్ కళాశాలకు 8 మంది ఉపాధ్యాయులను కేటాయించటంతో సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఏర్పడి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 59 పాఠశాలలకు 138 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా 125 మంది ఉన్నారు. వారిలో మరో 8 మంది జూనియర్ కళాశాలకు కేటాయించటంతో 117 తగ్గింది. మండలంలోని మొండెద్దుపాలెం గ్రామంలోని పాఠశాలను విద్యార్థులు లేక మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 6,829 మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా కనీసం 50–60 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కొందరు ఇళ్ల నుంచి బాక్సులు తెచ్చుకుని తింటుండగా మరికొందరు ఇళ్లకు వెళ్లి తిని వస్తున్నారు. 95 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటంతో కిందిస్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1391 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాల్సి ఉంది. అందులో 218 మంది ఉపాధ్యాయుల కొరత ఉందని ఆయా మండలాల ఎంఈవోలు తెలిపారు. త్రిపురాంతకం మండలంలో ఉపాధ్యాయులు అవసరాన్ని బట్టి ఎక్కువ మంది ఉన్నారని, వారిని సర్దుబాటు చేస్తున్నామని ఆ మండల ఎంఈవో తెలిపారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండటం లేదన్న ఆరోపణలు వినవస్తున్నా ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించడం కష్టంగా మారింది. యర్రగొండపాలెం మండలంలోని చిన్నకొలుకుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 25 మంది ఉపాధ్యాయులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఒకరే అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. చెన్నరాయునిపల్లె ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉండగా వారికి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాల పరిధిలోని 30 మంది విద్యార్థులు దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారని, చెన్నరాయునిపల్లె పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ముండ్లమూరు: గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని దర్శి సీఐ షేక్ సమీముల్లా హెచ్చరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామంలో ఎస్ఐ వి. నాగమల్లేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గ్రామంలో జరిగిన దాడి దురదృష్టకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యల్లో భాగంగా జైలుకు పంపుతామని చెప్పారు. వారు తిరిగి గ్రామంలోకి రావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పికెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టీడీపీకి చెందిన రెండు వర్గాల వారిని రామాలయం వద్దకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అల్లర్లను ప్రేరేపిస్తే ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. రెచ్చగొట్టే కార్యక్రమాలకు పదే పదే పాల్పడితే అలాంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఏసుబాబు, అంకారావు, మహేష్, ప్రేమానిధి, ఖాశిం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



శంకరాపురంలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ సమీముల్లా

మూడు నెలలకు తాగునీరు సరఫరా



55 శాతం నీటితో నిండిన సమ్మర్ స్టోరేజీ–1



100 శాతం నీటితో సమ్మర్ స్టోరేజీ–2

దొనకొండ: మండలంలోని చందవరం దగ్గర నిర్మించిన సమ్మర్ స్టోరేజీ–1ని సాగర్ కాలవ నీటితో 55 శాతం నింపారు. దీని సామర్థ్యం 855 మిలియన్ లీటర్లు. దొనకొండ మండలంలోని 27 గ్రామాలకు సుమారు 3 నెలలకు తాగునీటికి సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబు తెలిపారు. సమ్మర్ స్టోరేజీ–2 అధికారులు 100 శాతం నింపారు. దీని సామర్థ్యం 850 మిలియన్ లీటర్లు. 127 గ్రామాలకు నీరు సరఫరా చేస్తారు. అందులో హెచ్ఎం పాడు 67, కొనకనమిట్ల 55 గ్రామాలు, పొదిలి 5 గ్రామాలకు 3 నెలలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు (దర్శి): సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా మండలంలోని తూర్పు గంగవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గుంటి గంగాభవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, అమ్మవారికి అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న నానీ

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం కళాశాల అడ్మిన్ నాని బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభతో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రం చేసుకోవాలి

పెద్దారవీడు: భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు పరిశుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని హెచ్ఎం పి.రత్నశంకర్‌నాయక్ తెలిపారు. మండలంలో బద్వీడుచెర్లోపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా కార్యక్రమంలో భాగంగా గ్రామాలయ మరియు సార్ప్ సంస్థ జిల్లా మేనేజర్ టి.లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతులు పరిశుభ్రతపై సోమవారం అవగాహన కార్యక్రమం చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేతులు పరిశుభ్రత, నిరంతరం ఒక ప్రక్రియగా చేతులు శుభ్రత సంప్రదాయంగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు సబ్బుతో చేతులు కడుక్కుంటే క్రిములు, బ్యాక్టీరియా దరిచేరవని డెమో రూపంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మి వివరించారు. అనంతరం విద్యార్థులకు డెటాయిల్ సబ్బులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు ఎం.సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

దర్శి: దర్శి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో శ్రావణ్ కుమార్ తహసీల్దార్‌గా ఇక్కడ విధులు నిర్వర్తించి ఉన్నారు. ఈ సందర్భంగా హాజరైన శ్రావణ్‌కుమార్‌ను వీఆర్వోలు, స్థానిక ప్రజలు పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. గజమాలలు, పూల దండలతో ఘనంగా సత్కరించారు.

తాళ్లూరు (దర్శి): తాళ్లూరు మండల తహసీల్దార్‌గా పి.శింగారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శింగారావు మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి అవసరాలు ఉన్నా నేరుగా తనను సంప్రదించి పనులు చేయించుకోవచ్చని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండి సేవలందించడమే ప్రభుత్వ ఉద్యోగుల లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా శింగారావును పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

కురిచేడు: మండల తహసీల్దార్‌గా జి.రజనీకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని మద్దిపాడు తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల కోసం పల్నాడు జిల్లా దుర్గి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లి తిరిగి కురిచేడు వచ్చినట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ పరిపాలనను గాడిలో పెడతానని, సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని చెప్పారు. ఆమెను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

యర్రగొండపాలెం: స్థానిక తహసీల్దార్‌గా ఎం.హరిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా నరసరావుపేట నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన తహసీల్దార్ సోమ్లా నాయక్ నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

పుల్లలచెరువు: పుల్లలచెరువు నూతన తహసీల్దార్‌గా నయీమ్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నెల్లూరు జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జిల్లా అధికారులు ఈయన్ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు సాదరంగా స్వాగతం పలికి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి సమస్యలపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

ముండ్లమూరు: మండల తహసీల్దార్‌గా ఎల్.లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వెళ్లారు. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా నకరికల్లు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎల్.లక్ష్మీనారాయణ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణను సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. డీటీలు పుల్లారెడ్డి, స్రవంతి, ఆర్ఐ కేవీ ప్రసాద్, సిబ్బంది పోగుల శేషగిరిరావు, ప్రసాద్, దేవకాంత్, శ్రీనివాసరావు ఉన్నారు.

వరి పంటకు సాగు నీరు విడుదల చేయాలి

దర్శి: కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని నదులన్నీ నిండిపోయాయని, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వరి పంటకు సాగు నీరందించాలని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆకుల రవిశంకర్, ఎంపీడీఓ హనుమంతరావులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగర్ ప్రాజెక్ట్ కుడి కాలువ జోన్ 1కి సాగు నీరు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. జోన్–2లో ఉన్న ప్రకాశం జిల్లాకు కూడా వరి పంట , ఇతర ఆరుతడుల పంటకు కూడా సాగు నీరు ఇవ్వాలని కోరారు. ప్రకాశం జిల్లాలో సరి అయిన వర్షాలు ఇప్పటికి పడక పోవడంతో 20 శాతం కూడా పంటలు వేయలేదన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కృష్ణా జలాలను సముద్రం పాలు చేయకుండా అన్నీ మేజర్, మైనర్ ,నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువలను నింపాలని కోరారు. రైతులు నార్లు పోసుకుని పంటలు వేసుకునే విధంగా ఇప్పటి నుంచే సాగర్ జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కేవీ పిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నెలాఖరు వరకు కంది సాగు చేయవచ్చు



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు ఆగస్టు నెలాఖరు వరకు కంది పంట సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం దర్శి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, లాం ఫామ్ గుంటూరు వారు ఏర్పాటు చేసిన కంది ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కంది పంట సాగు చేసే రైతులు సాలుకు సాలుకు మధ్య దూరం తగ్గించి విత్తనాలు నాటుకోవాలన్నారు. లాం ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలంలో ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రానికి బాదాపురం గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. 20 మంది రైతులకు 20 ఎకరాల్లో ఎల్ఆర్‌జి 133–33 అను క్రొత్త కంది రకాన్ని సాగు చేస్తున్నట్లు తెలిపారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ చౌదరి మాట్లాడుతూ ఈ రకం కంది వెర్రి తెగులును తట్టుకుని మంచి దిగుబడి అందిస్తుందన్నారు. ఆముదం పంటను పరిశీలించి రసం పీల్చు పురుగు, లద్దె పురుగు నివారణకు మందులు వివరించారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకులు రవితేజ, విన్నీబాబు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు: కేరళలో తీవ్ర వర్షాలతో కొండ చరియలు విరిగిపడి 600 మందిపైగా గల్లంతై సర్వం కోల్పోవడంతో వారికి అండగా నిలిచేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. మండల కేంద్రం ముండ్లమూరులో సోమవారం పలువురి నుంచి సుమారు 12 వేల రూపాయలు సేకరించి సీపీఎం ప్రధాన కార్యాలయానికి చెక్ పంపినట్లు సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. విపత్తులో ఉన్న వారిని ఆదుకోవడం కోసం ప్రజాతంత్ర వాదులు, సామాజిక బాధ్యతగల వారు, రాజకీయ నాయకులు సామాన్య ప్రజలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందించి వారికి అండగా ఉండాలని కోరారు. విరాళాల సేకరణలో మండల కమిటీ సభ్యులు పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, గంగినేని సత్యనారాయణ, షేక్ మీరావలి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు పాల్గొన్నారు.